నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
06.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

**వందేండ్ల తుర్కియే**

తుర్కియే వందేండ్ల ఉత్సవాలను అక్టోబర్ 29న అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ ప్రారంభించారు. ఒట్టోమాన్ సామ్రాజ్యం పతనం తర్వాత టర్కిష్ (టర్కీ) రిపబ్లిక్‌గా అవతరించి వందేండ్లు పూర్తయ్యింది. టర్కీ పేరును తుర్కియేగా మార్చారు. తుర్కియే రాజధాని అంకారా. తుర్కియేలోని అతిపెద్ద నగరం, ఆర్థిక కేంద్రంగా ఇస్తాంబుల్ ఉంది. ఈ దేశ కరెన్సీ తుర్కిష్ లిరా (టీఆర్‌వై).

nipuna
Every Wednesday Free Supplement
15 నవంబర్ 2023
పేజీలు 8

# అధికార కాలమానం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?

## భారత కాలమానం

**నెలలు:** జ్యోతిషం, పండుగలు-పర్వదినాల నిర్ణయం కోసం హిందువులు విభిన్న రకాలైన కాలమానాలను ఉపయోగిస్తారు. క్రీ.శ.400 నాటిదైన సూర్యసిద్ధాంతం అనే పుస్తకాన్ని అనుసరించి సౌరమానాన్ని రూపొందించారు. ఇందులో సూర్యుడు ఒక ఏడాదిలో ప్రవేశించే 12 రాశులను 12 నెలలుగా పరిగణిస్తారు. అవి.. మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, సింహం, కన్య, తుల, వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం.

- కొన్ని ప్రాంతాల్లో చాంద్రమానాన్ని ఉపయోగిస్తారు. ఇందులో చైత్రం, వైశాఖం, జ్యేష్ఠం, ఆషాఢం, శ్రావణం, భాద్రపదం, ఆశ్వయుజం, కార్తికం, మార్గశిరం, పుష్యం, మాఘం, ఫాల్గుణం అనే 12 నెలలు ఉంటాయి.
- ఆయా నక్షత్రాల్లో పౌర్ణమి వచ్చే సందర్భాన్ని బట్టి నెల పేర్లను నిర్ణయించారు. ఉదాహరణకు చిత్తా నక్షత్రంలో పౌర్ణమి వస్తే నెల చైత్రం, విశాఖ నక్షత్రంలో పౌర్ణమి వస్తే అది వైశాఖం.

**రుతువులు:** వాతావరణంలో జరిగే మార్పులను అనుసరించి సంవత్సరాన్ని 6 రుతువులుగా విభజించారు. ఒక్కొక్క రుతువు సుమారు రెండు నెలలు ఉంటుంది. అవి..

- **వసంతం:** చెట్లు చిగురించి పూలు పూస్తాయి (చైత్రం, వైశాఖం)
- **గ్రీష్మం:** ఎండలు ఎక్కువగా ఉంటాయి (జ్యేష్ఠం, ఆషాఢం)
- **వర్ష:** నైరుతి రుతుపవన కాలం (శ్రావణం, భాద్రపదం)
- **శరద్:** వెన్నెల రాత్రులు, ఆహ్లాదకరమైన వాతావరణం (ఆశ్వయుజం, కార్తికం)
- **హేమంతం:** మంచు కురుస్తుంది. చలిగా ఉంటుంది (మార్గశిరం, పుష్యం)
- **శిశిరం:** చెట్లు ఆకులు రాల్చే కాలం (మాఘం, ఫాల్గుణం)

**వారాలు:** వారానికి రోజులు ఏడు. వీటికి పేర్లను క్రీ.శ.3వ శతాబ్దంలో గ్రీకుల కాలమాన ప్రభావం వల్ల నిర్ణయించారని అంటారు. వీటికి అప్పటికే మనిషి అంతరిక్షంలో పరిశీలించిన సూర్యుడు (ఆదివారం), చంద్రుడు (సోమవారం), అంగారకుడు (మంగళవారం), బుధుడు (బుధవారం), బృహస్పతి (గురువారం), శుక్రుడు (శుక్రవారం), శని (శనివారం) గ్రహాల పేర్లను పెట్టారు.

**పక్షాలు:** హిందూ కాలమానంలో నెలను రెండు పక్షాలుగా విభజించారు. మొదటిది శుక్లపక్షం. ఇది చంద్రుడు వృద్ధి పొందే దశ. ఇందులో పాడ్యమి నుంచి పౌర్ణమి వరకు మొత్తం 15 రోజులు ఉంటాయి. రెండోది కృష్ణపక్షం. ఇది చంద్రుడు క్షీణించే దశ. ఇందులో పాడ్యమి నుంచి అమావాస్య వరకు 15 రోజులు ఉంటాయి.

**తిథులు:** చాంద్రమానంలో రోజులను తిథుల రూపంలో పేర్కొంటారు. అవి.. పాడ్యమి, విదియ, తదియ, చవితి, పంచమి, షష్ఠి, సప్తమి, అష్టమి, నవమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి వరుసగా వస్తాయి. చతుర్దశి తర్వాత శుక్ల పక్షంలో అయితే పౌర్ణమి, కృష్ణ పక్షంలో అమావాస్య వస్తాయి. చంద్ర గ్రహణం పౌర్ణమి నాడు, సూర్య గ్రహణం అమావాస్య నాడు ఏర్పడతాయి.

**నక్షత్రాలు:** ఇవి 27. అశ్వని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర, ఆరుద్ర, పునర్వసు, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ, ఉత్తర, హస్త, చిత్త, స్వాతి, విశాఖ, అనురాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణం, ధనిష్ఠ, శతభిషం, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతి.

**అధిక మాసం - క్షీణ మాసం**

- ఒక చాంద్రమాసంలో సూర్యుడు మరో కొత్త రాశిలోకి సంక్రమణం చెందకపోతే ఆ నెలను అధిక మాసం అంటారు. ఇది సాధారణంగా రెండు మూడేళ్లకోసారి వస్తుంది. ఒక చాంద్రమాసంలో సూర్యుడు రెండు రాశుల్లో సంక్రమిస్తే దాన్ని క్షీణ మాసం లేదా క్షయ మాసం అంటారు. ఇది చాలా అరుదుగా వస్తుంది. గతంలో 1983, జనవరి 15-ఫిబ్రవరి 12 మధ్య వచ్చింది.
- అయనాలు రెండు... ఒకటి ఉత్తరాయణం (జనవరి 14 నుంచి జూలై 13 వరకు). రెండోది దక్షిణాయనం (జూలై 14 నుంచి జనవరి 13 వరకు).

**యుగాలు:** కృత, త్రేత, ద్వాపర, కలి నాలుగు యుగాలు. ధర్మం నడిచే దాన్ని బట్టి వీటిని వరసగా సువర్ణ, రజత, కంచు, ఇనుప యుగాలుగా పేర్కొంటారు.

**అధికార కాలమానం:** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక గ్రెగోరియన్ కాలమానంతో పాటు మనదైన కాలమానం ఉండాలని ప్రభుత్వం భావించింది. దీని రూపకల్పన కోసం భౌతిక శాస్త్ర శాస్త్రవేత్త మేఘనాథ్ సాహా ఆధ్వర్యంలో కాలమాన సంస్కరణల సంఘాన్ని నియమించింది. అప్పటికి దేశంలో వాడుకలో ఉన్న దాదాపు 30 పంచాంగాలను పరిశీలించిన సాహా కమిటీ అవసరాలకు తగినట్లుగా ఉండేలా ఒక కాలమానాన్ని రూపొందించింది. దీనికి 1957లో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇది 1957, మార్చి 22 నుంచి అమల్లోకి వచ్చింది.

- సాధారణ సంవత్సరంలో మార్చి 22, లీప్ సంవత్సరంలో మార్చి 21న కొత్త ఏడాది మొదలవుతుంది. దీనికి శక సంవత్సరాన్ని ఆధారంగా తీసుకున్నారు. శక సంవత్సరం క్రీ.శ.78 నుంచి మొదలైంది. అంటే జాతీయ కాలమానంలో సంవత్సరాలు 78 ఏళ్ల వెనుక ఉంటాయి. భారత ప్రభుత్వ రాజపత్రంలో, ఆకాశవాణి, దూరదర్శన్ ప్రసారాల ప్రారంభంలో గ్రెగోరియన్ కాలమానంతో పాటు శక కాలమానాన్నీ ఉపయోగిస్తున్నారు.
- **విక్రమ శకం:** ప్రాచీన కాలంలో భారతీయ రాజులకు విక్రమాదిత్య బిరుదు తీసుకోవడం సంప్రదాయంగా ఉంది. క్రీ.పూ.58లో ఎవరో ఒక ఉజ్జయిని రాజు శకులను ఓడించినట్లు ఆధారాలున్నాయి. ఈ విజయాన్ని పురస్కరించుకొని ఆ రాజు తనను తాను 'విక్రమాదిత్య'గా సంబోధించుకున్నాడు. ఇంకా అదే సంవత్సరం ఆధారంగా 'విక్రమ శకం' ప్రారంభించాడు. ఇది మొదలుగా తాము గొప్ప విజయాలు సాధించామనుకున్న రాజులు 'విక్రమాదిత్య' బిరుదు ధరించడం మొదలుపెట్టారు. గుప్త రాజు రెండో చంద్రగుప్తుడు మొదలుకొని క్రీ.శ.12వ శతాబ్దం వరకు దాదాపు 14 మంది రాజులు కనిపిస్తారు. చివరగా రెండో పానిపట్ యుద్ధంలో అక్బర్‌ను ఎదిరించిన హేము తనను తాను హేమచంద్ర విక్రమాదిత్యగా ప్రకటించుకున్నాడు. అనాదిగా భారతదేశంలో వాడుకలో ఉన్న శకాల్లో ఈ విక్రమ శకం ఒకటి.

**తెలుగు సంవత్సరాలు 60**

| | |
|---|---|
| 1) ప్రభవ | 2) విభవ |
| 3) శుక్ల | 4) ప్రమోదూత |
| 5) ప్రజోత్పత్తి | 6) అంగీరస |
| 7) శ్రీముఖ | 8) భవ |
| 9) యువ | 10) ధాత |
| 11) ఈశ్వర | 12) బహుధాన్య |
| 13) ప్రమాధి | 14) విక్రమ |
| 15) వృష | 16) చిత్రభాను |
| 17) స్వభాను | 18) తారణ |
| 19) పార్థివ | 20) వ్యయ |
| 21. సర్వజిత్తు | 22. సర్వధారి |
| 23. విరోధి | 24. వికృతి |
| 25. ఖర | 26. నందన |
| 27. విజయ | 28. జయ |
| 29. మన్మథ | 30. దుర్ముఖి |
| 31. హేవలంబి | 32. విలంబి |
| 33. వికారి | 34. శార్వరి |
| 35. ప్లవ | 36. శుభకృతు |
| 37. శోభకృతు | 38. క్రోధి |
| 39. విశ్వావసు | 40. పరాభవ |
| 41. ప్లవంగ | 42. కీలక |
| 43. సౌమ్య | 44. సాధారణ |
| 45. విరోధికృతు | 46. పరీధావి |
| 47. ప్రమాదిచ | 48. ఆనంద |
| 49. రాక్షస | 50. నళ |
| 51. పింగళ | 52. కాళయుక్తి |
| 53. సిద్ధార్థి | 54. రౌద్రి |
| 55. దుర్మతి | 56. దుందుభి |
| 57. రుధిరోద్గారి | 58. రక్తాక్షి |
| 59. క్రోధన | 60. అక్షయ |



**పండుగలు**

- ఉగాది- చైత్ర శుద్ధ పాడ్యమి
- శ్రీరామ నవమి- చైత్ర శుద్ధ నవమి
- బుద్ధ జయంతి- వైశాఖ పౌర్ణమి
- ఏరువాక పున్నమి- జ్యేష్ఠ పౌర్ణమి
- రాఖీ పౌర్ణమి- శ్రావణ పౌర్ణమి
- కృష్ణాష్టమి- శ్రావణ బహుళ అష్టమి
- వినాయక చవితి- భాద్రపద శుద్ధ చవితి
- నవరాత్రులు- ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి మహార్నవమి వరకు
- దసరా/ విజయదశమి- ఆశ్వయుజ శుద్ధ దశమి
- దీపావళి- ఆశ్వయుజ అమావాస్య
- వసంత పంచమి- మాఘ శుద్ధ పంచమి
- మహా శివరాత్రి- మాఘ బహుళ చతుర్దశి
- హోలీ- ఫాల్గుణ పౌర్ణమి

సంకలనం
హర్షవర్ధన్ చింతలపల్లి

---

4వ పేజీ తరువాయి..

**కోరల్ రీఫ్స్ పరిరక్షణకు జరుగుతున్న కృషి**

**అంతర్జాతీయంగా..**

1) **ఇంటర్నేషనల్ కోరల్ రిలీఫ్ ఇనిషియేటివ్:** కోరల్ రీఫ్స్, దాని అనుబంధ పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలు, కొన్ని స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఏర్పడిన కూటమి ఇది. భారతదేశం కూడా ఈ కూటమిలో సభ్యదేశంగా ఉంది. ఈ కూటమికి సంబంధించిన ఆపరేషనల్ నెట్‌వర్క్ 'ది గ్లోబల్ కోరల్ రీఫ్ మానిటరింగ్ నెట్‌వర్క్'.

2) **గ్లోబల్ కోరల్ రీఫ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ యాక్సిలరేటర్ ప్లాట్‌ఫాం:** ఇది కోరల్స్‌ను పరిరక్షించే నిమిత్తం పరిశోధన, సాంకేతికతల అభివృద్ధి కోసం జీ20 దేశాలు తీసుకున్న చొరవ (2020లో). భారత్ దీనిలోనూ సభ్యత్వం కలిగి ఉంది.

**జాతీయంగా..**

1) నేషనల్ కోస్టల్ మిషన్ ప్రోగ్రామ్ ద్వారా దేశంలోని కోరల్ రీఫ్స్ రక్షణ, సుస్థిరతల కోసం చర్యలు చేపడుతున్నారు.

2) మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్‌చేంజ్ (ఎంవోఈఎఫ్ అండ్ సీసీ) కోస్టల్ జోన్ స్టడీస్‌ను చేపట్టింది. దీనిలో భాగంగా కోరల్ రీఫ్స్‌పై కూడా అధ్యయనాలు జరుగుతున్నాయి. ఎంవోఈఎఫ్ అండ్ సీసీ పగడపు దీవుల పరిరక్షణకు వివిధ మార్గదర్శకాలు కూడా విడుదల చేసింది.

3) గుజరాత్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కలిసి సంయుక్తంగా కోరల్ రీఫ్స్ పునర్నిర్మాణం దిశగా 'Big Rock (or) Mineral accre tion technology'తో ప్రయోగాలు చేస్తున్నాయి. ఎలక్ట్రోడ్ల ద్వారా అతి స్వల్ప స్థాయిలో విద్యుత్‌ను సముద్ర జలాల్లో ప్రసరింపజేయడం ద్వారా కాల్షియం అయాన్లు, కార్బోనేట్ అయాన్లు కూడి క్యాథోడ్‌లపై కాల్షియం కార్బోనేట్‌ను మేటగా వేస్తాయి. కోరల్ లార్వాలు ప్రత్యేకంగా కవచాలను ఏర్పాటు చేసుకునే ప్రయాస లేకుండా, వీటికి అతికి త్వరగా పెరుగుతాయి. ఇదే Big Rock technology.

4) అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ రిమోట్ సెన్సింగ్‌ను ఉపయోగించి పగడపు దిబ్బల వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తుంది.

5) 1991 నాటి కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (CRZ) నోటిఫికేషన్ అన్ని సముద్ర వనరులకు రక్షణ కల్పిస్తుంది. సెక్షన్ 7(2) ప్రకారం పగడపు దిబ్బల క్వారీయింగ్, పగడపు దిబ్బలపై బీచ్ రిసార్టులు, హోటళ్ల నిర్మాణం నిషేధించారు.

6) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, నేషనల్ సెంటర్ ఫర్ సైన్సెస్, సెంట్రల్ మెరైన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, అన్నామలై, మధురై కామరాజ్ యూనివర్సిటీ, ఇతర అనేక సంస్థల్లో కోరల్స్‌పై పరిశోధనలు జరుగుతున్నాయి.

- ప్రవాళ భిత్తికలు నాశనమైతే సముద్ర పర్యావరణం ప్రమాదంలో పడుతుంది. కార్బన్ డై ఆక్సైడ్ శోషణ తగ్గి భూమిపై ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. ఆక్సిజన్ ఉత్పత్తి కొరత ఏర్పడి పరిస్థితి మరింత దుర్భరం అవుతుంది.
- అందుకే ప్రపంచ సుస్థిర మనుగడకు సాధించాల్సిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఒకానొక ప్రత్యేక లక్ష్యంగా 'లైఫ్ బిలో వాటర్'ను చేర్చారు.

**గ్రేట్ బారియర్ రీఫ్**

- ఆస్ట్రేలియాకు ఈశాన్య భాగంలో ఈ గ్రేట్ బారియర్ రీఫ్ (కోరల్ రీఫ్) ఉంది.
- ఇది దాదాపు 3,48,700 చ.కి.మీ. విస్తీర్ణంతో ప్రపంచంలోనే అతిపెద్ద కోరల్ రీఫ్‌గా ఉంది. దీన్ని 1981లోనే యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది.
- ఈ రీఫ్‌లో 400 రకాల పగడపు జీవులు, 1500 జాతుల చేపలు, 4000 రకాల మొలస్కా జాతి జీవులున్నాయి. వీటితో పాటు మరెన్నో జీవజాతులకు ఈ ప్రదేశం అనుకూలం.
- గ్రీన్ టర్టిల్ (ఆకుపచ్చ తాబేళ్లు), డ్యుగాంగ్ (Dugong) సీకా జాతులు వంటి అరుదైన, అంతరించే స్థితిలో ఉన్న జాతులకు నివాసం ఈ గ్రేట్ బారియర్ రీఫ్.
- ఈ సంవత్సరం ఎల్‌నినో కండిషన్స్ వల్ల గ్రేట్ బారియర్ రీఫ్‌లో కోరల్ బ్లీచింగ్ బాగా జరిగే అవకాశం ఉందని ఇటీవల ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెరైన్ సైన్సెస్ ప్రకటించింది. ఈ సంస్థ గత 37 సంవత్సరాల నుంచి గ్రేట్ బారియర్ రీఫ్ స్థితిగతుల గురించి ఏటా నివేదిక ఇస్తుంది.
- ఆస్ట్రేలియాకు గ్రేట్ బారియర్ రీఫ్ ప్రధాన టూరిస్ట్ ఆకర్షణల్లో ఒకటి.
- 2016-17 సంవత్సరాల్లో మెరైన్ హీట్ వేవ్స్, ఎల్‌నినో పరిస్థితులు కలిసి కోరల్ బ్లీచింగ్ పెద్ద ఎత్తున జరగడానికి కారణమయ్యాయి. దీనికి తోడు క్రౌన్ ఆఫ్ థోర్న్స్ స్టార్‌ఫిష్ దాడులు, తుపానులు, కాలుష్యం కారణంగా గ్రేట్ బారియర్ రీఫ్ బాగా దెబ్బతింటుందని సైంటిస్టులు వెలువరించిన అంశాలు ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన రేకెత్తించాయి. గత నాలుగైదు సంవత్సరాలుగా నెలకొన్న లా నినా పరిస్థితుల వల్ల ఈ గ్రేట్ బారియర్ రీఫ్ తిరిగి కోలుకుంటుందని గమనించారు. ఈ ఏడాది తిరిగి ఎల్ నినో పరిస్థితులు కలగడం ఆందోళన రేకెత్తిస్తుంది.